క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెందుర్తి: సతివానిపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సీతారామగార్డెన్స్, తులసి గార్డెన్స్, గ్యాస్ గొడౌన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

భైరవస్వామికి విశేష అభిషేకాలు



భైరవస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: అమావాస్య సందర్భంగా భైరవ స్వామికి గురువారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భైరవస్వామిని దర్శించుకున్నారు. విభూదితో అభిషేకం నిర్వహించారు.

సరదా ఆటలు ఆడుదాం



ధ్యానం చేస్తున్న పిల్లలు

పెందుర్తి: పెందుర్తి శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం చిన్నారులకు కథలు చదవడం, రాయడం, చెప్పడం నేర్పించారు. అనంతరం ధ్యానం చేయించారు. సరదా ఆటలు ఆడుదాం కార్యక్రమంలో భాగంగా పాసింగ్ బాల్ గేమ్ ఆడించారు. ధ్యానంలో మెళకువలు నేర్పారు. దేశ భక్తి గీతాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆదారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్స్ స్టాక్ పాయింట్ తనిఖీ



స్కూల్ బ్యాగ్స్ నాణ్యత పరీక్షిస్తున్న గీత, అప్పలనాయుడు

పెదగంట్యాడ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన స్కూల్ బ్యాగ్స్ స్టాక్ పాయింట్‌ను జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, ఏపీవో అప్పలనాయుడు గురువారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను మండల విద్యాశాఖాధికారులు ఇ.శ్రీనివాసరావు, కె.రమణాజీలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు. స్కూల్స్ తెరిచే నాటికి బ్యాగ్స్ పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరాలయ హుండీ ఆదాయం లెక్కింపు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపును గురువారం చేపట్టారు. మార్చి 22 నుంచి జూన్ 6వ తేదీ వరకు రూ.92 వేల 288 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి ఎ.జగన్నాధరావు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణ అధికారి టి.ఎల్.ఎన్.రాజు, ఆలయ అర్చకులు, పాలక మండలి మాజీ సభ్యులు, శ్రీవారి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

◆ సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై ఉంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

పెందుర్తి అభివృద్ధికి కృషి

- పంచగ్రామాల భూసమస్య, తాడి తరలింపును వేగవంతం చేస్తాం..
- ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: అన్ని రంగాల్లో పెందుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చెప్పారు. ఎన్నికల్లో తనకు భారీ మెజారిటీ ఇచ్చి ప్రజలు తన బాధ్యతను ఎంతో పెంచారన్నారు. సుజాతనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఐదేళ్ల పాటు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. తన విజయానికి పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పదవిపై ప్రతీ ఒక్కరికీ ఆశ ఉంటుందని..తనకు తానుగా పదవి కోసం డిమాండ్ చేయనని.. అవకాశం వస్తే మాత్రం సంతోషంగా స్వీకరిస్తానని చెప్పుకొచ్చారు. తన అనుచరులు, నాయకులు తన పేరు చెప్పుకుని ఏవైనా పొరపాట్లు చేస్తే తన దృష్టికి తక్షణమే తీసుకురావాలని కోరారు. తన కుటుంబ సభ్యులు, తన అనుచరులు ఎక్కడా పాలనలో వేలు పెట్టరని.. అన్నీ తానే చూసుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో తానిచ్చిన హామీలన్నీ నెరవేర్చుతానని చెప్పారు. పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. తాడి తరలింపునకు తక్షణమే చొరవ తీసుకుంటామన్నారు. కాలుష్య రహిత కంపెనీలను పెందుర్తికి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. పరవాడలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఉన్నతాధికారులతో కలిసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, నాయకులు శానాపతి శంకర్రావు, గొర్లె రామునాయుడు, పిల్లా జగన్‌మోహన్‌పాత్రుడు, కంచిపాటి మధు, శానాపతి సోమశేఖర్, పిన్నింటి వరలక్ష్మి, గొర్లె అప్పారావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో ఒకరికి జైలు

సబ్బవరం: మహిళపై దాడి చేసిన కేసులో మండలంలోని పైడివాడ అగ్రహారానికి చెందిన ఓ వ్యక్తికి అనకాపల్లి కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధించినట్టు సబ్బవరం సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన పెచ్చేటి దుర్గారావు, గుండాల సంతోషి పక్కపక్క ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సంతోషి తమ ఇంటి వద్ద గతంలో రిగ్గు బోరు తీయిస్తుండగా బోరు నుంచి వస్తున్న బురుద దుర్గారావు ఇంటిపై పడింది. దీంతో వివాదం చెలరేగింది. పెచ్చేటి దుర్గారావు.. సిద్ధయ్య భార్య సంతోషిని రాయితో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. 2022 మార్చి 12న సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అనకాపల్లిలోని 12వ ఏఎంఎం కోర్టు 324 ఐపీసీ సెక్షన్ ప్రకారం ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానాతో పాటు 509 ఐపీసీ సెక్షన్ కింద అదనంగా మరో సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సబ్బవరం: ప్రతి రోజూ యోగాసనాలు వేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని గ్రంథాలయ అధికారి వి.శిరీష తెలిపారు. స్థానిక సబ్బవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. ఇందులో భాగంగా గురువారం యోగాసనాలతో పాటు విద్యార్థులకు పేపర్ రీడింగ్, నీతి కథలు చదవడంపై పోటీలు నిర్వహించారు. ఇటువంటి పోటీలతో విద్యార్థుల మెదడుకు మేదస్సు పెరుగుతుందని శిరీష చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణాన్ని కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: భావితరాల భవిష్యత్తుతో పాటు వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా కృషి చేయాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని పిలుపునిచ్చారు. దీనిపై ప్రతి విద్యార్థి తమ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారంతా విరివిగా మొక్కలు నాటేలా చైతన్యం తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ టీఎంఏ నివేదిత, వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, సిబ్బంది డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎం.వి.రామకృష్ణ, బి.లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల భవితపై ప్రత్యేక శ్రద్ధ

- డీఈవో చంద్రకళ
- వడ్లపూడిలో భవిత కేంద్రం సందర్శన



దివ్యాంగ బాలలతో డీఈవో చంద్రకళ, ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసరావు



ఆవరణలో మొక్కలు నాటుతున్న చంద్రకళ, శ్రీనివాసరావు

అగనంపూడి: దివ్యాంగుల భవితను ఆశాజనకంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా భవిత కేంద్రాలు కృషి చేస్తున్నాయని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. 87వ వార్డు వడ్లపూడిలోని భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే పిల్లలకు ఈ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారన్నారు. సిబ్బంది వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, వారిలో మానసిక స్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు, గాజువాక మండల విద్యాశాఖాధికారులు సునీత, విశ్వనాథం, ఏపీఎస్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్ బాబూరావు, సర్వశిక్షా అభియాన్ కో–ఆర్డినేటర్ గీత, సీఎంవో అప్పలనాయుడు, సిరి ఫౌండేషన్ ప్రతినిధి ఎల్వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక తరగతుల గుర్తింపునకు జిప్సా వినతి



ఎంఈవోలకు వినతిపత్రం అందజేస్తున్న జిప్సా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు సునీత, విశ్వనాధం, శ్రీనివాస్, రమణాజీలను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్వహిస్తున్న ప్లే స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లే స్కూళ్ల ముసుగులో 1, 2, 3 తరగతులను కూడా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నగర పరిధిలో పుట్టగొడుగుల్లా వీధికొకటి పుట్టుకొస్తున్న ప్లే స్కూల్స్‌ను పరిశీలించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిప్సా అధ్యక్షుడు పి.భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్, సభ్యులు సత్యనారాయణ, బాబూరావు, విజయ్ తదితరులున్నారు.

టీడీపీ మిత్రపక్షాలు చొరవ తీసుకోవాలి

- విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్.నరసింగరావు
- 1211వ రోజుకు రిలే దీక్షలు



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

అగనంపూడి: కేంద్రంలో రాష్ట్ర ఎంపీల ప్రాధాన్యం పెరిగిన క్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్.నరసింగరావు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో కొనసాగుతున్న దీక్ష శిబిరంలో 1211వ రోజు, గురువారం ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ కేంద్రంలో ఏర్పాటు కానున్న ఎన్డీఏలో టీడీపీ మిత్రపక్షం ప్రాధాన్యం రెట్టింపు అయిందని, ఇదే సమయంలో విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలాగే రాష్ట్రానికి సాగు, తాగు నీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా చొరవ తీసుకోవాలన్నారు. అర్ధంతరంగా నిలిచిన ప్రాజెక్టును పూర్తి చేసి ఆ ఖ్యాతిని దక్కించుకోవాలన్నారు. ఏ ప్రాంతం అభివృద్ధి చేసినా విశాఖను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. విశాఖ రైల్వేజోన్ పేరుకే గాని ఇక్కడ ఏర్పాటు పనులు ముందుకు సాగడం లేదని, కొన్ని రాష్ట్రాల పెత్తనం తగ్గాలంటే విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు కోసం టీడీపీ, జనసేన పట్టుబట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.వెంకటరావు, శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు.

రారెత్తించిన టమాటా

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర భారీగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉన్న టమాటా, ఈ వారం రూ.60కి పెరిగింది. ఉల్లిపాయ రూ.25 నుంచి రూ.30, బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40కి పెరిగాయి. బీట్రూట్, క్యారెట్, బెండకాయ, వంకాయ, దొండకాయ రూ.40, బీరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన సముదాయం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో చేరడానికి ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులలో చేరగోరే విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులను చేసుకోవాలన్నారు. కళాశాలలో బీఏ ఎకనామిక్స్ ఆనర్స్ కోర్సులో 60 సీట్లు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 60 సీట్లు, బీఎస్సీ జువాలజీలో ఆనర్స్ కోర్సు 40 సీట్లు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో 40 సీట్లు, బీఎస్సీ ఫిజిక్స్ ఆనర్స్ కోర్సులో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఓఏఎండీసీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన ఫ్యాకల్టీ, అన్ని సదుపాయాలు ఉన్నాయని, చక్కని విద్యా బోధన అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలో చేరాల్సిందిగా కోరారు. డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 14 నుంచి నాల్గో సెమిస్టర్ పరీక్షలు, మధ్యాహ్న సమయంలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలపై చర్చ



యూనియన్ నాయకులతో చర్చిస్తున్న ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్

డాబాగార్డెన్స్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిటూ) విశాఖ జిల్లా నాయకులు గురువారం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌తో చర్చించారు. చర్చలు అనంతరం ప్రధాన వైద్యాధికారి సిటూ నాయకులతో మాట్లాడుతూ ముఖ్యంగా సేఫ్టీ పరికరాలు, రెయిన్‌కోట్లు, సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫాం, మాస్కులు, గ్లౌజులు, గమ్ముబూట్లు ఇస్తామని, అలాగే చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, సాధారణ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.7లక్షలు, అలాగే బకాయి హెల్త్ అలవెన్స్, కార్మికులకు ఐడీ కార్డులు జారీ చేస్తామన్నారని యూనియన్ నాయకులు తెలిపారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు చేస్తామని, డెత్, 60 ఏళ్ల దాటిన లాంగ్ ఆబ్సెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోమన్నారన్నారు. చర్చల్లో యూనియన్ అధ్యక్షుడు టి నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జేఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు

కోటవురట్ల: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో సత్తా చాటిన పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు దుబాసి యశస్విని, మళ్ల చర్మిళ, సూరిశెట్టి రష్మిత, తీడ వెంకట రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దాంతో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాలీ షా, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు పట్టుదలగా కృషి చేయాలన్నారు.

నూకాంబికకు చీరల అలంకరణ



చీరలతో భక్తులకు దర్శనం ఇస్తున్న తాకాశివీధి నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని అమావాస్య పురస్కరించుకుని భక్తులు సమర్పించిన 101 చీరలతో గురువారం అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నిర్మాణాత్మక అభ్యసనకు కృషి



డీఆర్‌పీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఏఎంవో పట్నాయక్

కశింకోట: బాల బాలికల్లో నిర్మాణాత్మక అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేయాలని జిల్లా ఏఎంవో ఎం.ఎం.పట్నాయక్ కోరారు. కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో డీఆర్‌పీలకు రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతుల బాలలు పరిపూర్ణ విద్యా వృద్ధి సాధించేందుకు నూతన బోధనా పద్ధతులను, మూల్యాంకన విధానాలను ఉపాధ్యాయులు అలవర్చుకుని, పాఠశాలల్లో అమలు పరచాలన్నారు. ఈ శిక్షణను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు, డైట్ లెక్చరర్ మాధవి, ఎంఈవోలు కె.చిట్టిబాబు, కేఎస్ఎన్ మూర్తి, డి.వేణుగోపాలరావు(మునగపాక), రిసోర్స్ పర్సన్లు కె.ఉమామహేశ్వరరావు, కె.నానాజీ, సీహెచ్ఎన్ దొర, కేవీఎల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా స్టేడియానికి కొత్త హంగులు



ఇందిరా మున్సిపల్ స్టేడియం (2024)



ఇందిరా మున్సిపల్ స్టేడియం (1972)

జగదాంబ: ఇందిరా మున్సిపల్ స్టేడియం కొత్త హంగులు సంతరించుకుంది. 1972 నాటి స్టేడియానికి జీవీఎంసీ రూ.5 కోట్ల పైగా నిధులు కేటాయించింది. దీంతో స్టేడియం రూపురేఖలు పూర్తిగా మారిపోయింది. అత్యాధునిక హంగులతో రూపుదిద్దిన ఈ స్టేడియం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.